నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు గౌతమీ నగర్, వార్డు కార్యాలయం, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- కెపీఎస్ఆర్ ఎన్‌క్లేవ్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కెపీఎస్ఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ రోడ్డు నెంబర్లు 2,4,6,8 (జనప్రియ నుంచి అయ్యప్ప స్వామి టెంపుల్)ఏరియాలలో..
- శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు శ్రీరాంనగర్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, కిన్నెర హోటల్, గంగారం ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

ప్రసిద్ధ దేవాలయాల సందర్శనకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్–1డిపో పరిధిలో తెలంగాణ ప్రసిద్ధ దేవాలయాల సందర్శనకు ప్రతి శని, ఆదివారాల్లో సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వి. మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, జైన మందిర్, భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాలు, లక్నవరం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, బొగ్గట్ట వాటర్ ఫాల్స్, మేడారం, రామప్ప ఆలయాలకు రెండు రోజుల పాటు ప్రత్యేకంగా నడుస్తున్నాయని తెలిపారు.ఈ బస్సులు మియాపూర్ నుండి ఉదయం 5 గంటలకు బయల్దేరి పలు దేవాలయాల దర్శనాల అనంతరం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. 30 మందికంటే ఎక్కువ భక్తులు ఉంటే ఏ రోజైనా దేవాలయాల సందర్శనకు పంపుతామన్నారు. వివరాలకు 8500309052,7659029882 ,9959226153 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



దీసీకి సమస్యలు వివరిస్తున్న మహేష్ యాదవ్

చందానగర్: హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం చందానగర్ సర్కిల్ –21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని, రోడ్లను ఆక్రమించడం వల్ల అంబులెన్స్, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని వివేకానందనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గ్యాస్ట్రో ఎంటరాలజీకి సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పవన్ రెడ్డి తొండపు పాల్గొని గ్యాస్ట్రో ఎంటరాలజి సమస్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్ హాలులో 10వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు ఈ ఉంటుందని, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం హేమంత్‌బోర్ఖడేతో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం డ్రైనేజీ, రోడ్లు, శానిటేషన్ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను జోనల్ కమిషనర్ ఆదేశించారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు మంజూరైన 19 లక్షల 85 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.



హాఫీజ్‌పేట్ వినాయక నగర్ వద్ద అసంపూర్తిగా రోడ్డు పనులు

900 మీటర్లు.. రూ. 1.53 కోట్ల నిధులు



త్వరలో మంజీరా రోడ్డు పనులకు మోక్షం

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని లింగంపల్లి చౌరస్తాలోని బీఆర్ గ్యాస్ గోడౌన్ నుంచి చందానగర్ సర్కిల్ –21 చౌరస్తా వరకు 900 మీటర్ల రోడ్డు 20 అడుగుల మేర విస్తరణకు సుమారు రూ.1.53 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న మంజీరా రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. కాగా లింగంపల్లి బీఆర్ గ్యాస్ గోడౌన్ నుంచి చందానగర్ సర్కిల్ కార్యాలయం చౌరస్తా వరకు తీవ్ర ట్రాఫిక్, రోడ్డుపైనే చిరు వ్యాపారాలు ఉండడంతో వాటి తొలగింపు ప్రక్రియ టౌన్ ప్లానింగ్ అధికారులకు కత్తిమీద సాములాగా మారింది. 900 మీటర్ల రోడ్డు విస్తరణపై ఇంజనీరింగ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. కాగా హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులు పైప్‌లైన్ వేసిన చోట పోసిన మట్టి వరద నీటికి కుంగిపోతోంది.

హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో...

ఇప్పటి వరకు హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో హాఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి హుడా కాలనీ ఎక్సైజ్ స్టేషన్ వరకు రూ.4.31 కోట్లతో సీసీ రోడ్డు పనులు మూడు దశలలో ప్రారంభమయ్యాయి. కానీ హాఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు 4 లేన్‌ల రోడ్డు ఉండగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా రోడ్డు పనులు చక చకగా పూర్తి అయ్యాయి. రెండవ దశలో ఆర్టీసీ కాలనీ నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడవ దశ ఎక్సైజ్ స్టేషన్ నుంచి చందానగర్ సర్కిల్ సమీపంలోని చౌరస్తా వరకు నిర్వహించనున్నారు. మూడవ దశకు నిధులు మంజూరు కాలేదు. మరోవైపు వర్షాకాలం ప్రారంభమవుతుండడంతో మంజీరా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంపై వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎక్సైజ్ స్టేషన్ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు చినుకు పడితే రోడ్డు బురదమయంగా మారుతుంది. ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. ఒకవైపు గుంతలు...మరోవైపు చెరువును తలపిస్తోంది. ఏళ్ళు గడుస్తున్నా పరిస్థితి మారలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. చందానగర్‌లో చేపట్టబోయే మంజీరా పైప్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

చందానగర్ డివిజన్ పరిధిలో మంజీరా పైప్ లైన్ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి. పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. 900 మీటర్లకు రూ.1.53 కోట్లతో పనులు చేపట్టనున్నాం. నూతనంగా వేసిన మంజీరా పైప్ లైన్‌పై వేసిన మటి తొలగింపు జరుగుతోంది. ఈ పనులు పూర్తయ్యాక తర్వాత సీసీ రోడ్డు వేస్తాం.

– దుర్గాప్రసాద్, డీఈ చందానగర్ డివిజన్

మూడ దశల్లో రోడ్డు పనులు

హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో మంజీరా పైప్ లైన్ రోడ్డు మరమ్మతులతో పాటు నూతన రోడ్డు పనులు మూడు దశల్లో చేపట్టడం జరుగుతుంది. ఇప్పటి వరకు 2కిలోమీటర్ల మేర సీసీ రోడ్డును రూ.3.40 కోట్లతో పూర్తి చేశాం. రెండవ దశ పనులు మొదలయ్యాయి. మూడవ దశ పనులకు నిధులు విడుదల కాలేదు.

– శ్రీదేవి, డీఈ, హాఫీజ్‌పేట్ డివిజన్



మంజీరా రోడ్డులో చిరువ్యాపారాలు



అసంపూర్తిగా రోడ్డు పనులు



ఆర్టీసీ కాలనీ వద్ద ..

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రిక ప్రసాద్ గౌడ్

మియాపూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షురాలు పి.చంద్రిక ప్రసాద్‌గౌడ్ అన్నారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మియాపూర్‌లో నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అగ్ర నాయకుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బూత్ కమిటీల బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా నాయకులు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతినెల మొదటి వారంలో జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంతో పాటు నాయకత్వ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మహిళా నాయకులు శ్రీదేవి, భాగ్యలక్ష్మీ, జిల్లా సెక్రటరీ రాణి, డివిజన్ల అధ్యక్షులు రాజ్యలక్ష్మీ, విమల, లక్ష్మీ, శ్రీజ్యోతి, సుప్రజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆదర్శనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిని అభివృద్ధిలో మోడల్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో జరుగుతున్న పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజీ పనులు పూర్తి చేసిన తర్వాత సీసీ రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఈ భాస్కర్, మాజీ కౌన్సిలర్ సోందాస్, కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, సత్యనారాయణ, రమేష్, నరసింహారెడ్డి, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

మెరుగైన విద్య అవసరం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను సోమవారం బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతరావు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, అడ్మిషన్ల ప్రక్రియ గురించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ విద్యలో నూతన సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యను అందించేందుకు ఏఐ ఆధారిత డిజిటల్ విద్యాబోధన అమలు చేయాలని, అదే విధంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, ఆటస్థలం, లైబ్రరీతో అన్ని వసతులు మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్ గౌడ్, భగవంత్ రెడ్డి, గోపి, సూరిబాబు, వెంకటరమణ, జగదీష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

ఆల్విన్‌కాలనీ: టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మబండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులను ఏఐ ఎక్స్‌రే ద్వారా గుర్తింపు, టీబీపై అవగాహన కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ రెండు వారాలపాటు నిరంతరం దగ్గు, దగ్గినప్పుడు, శ్వాస తీసుకున్నప్పుడు, దగ్గుతున్నప్పుడు ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, బలహీనత, సాయంత్ర వేళల్లో జ్వరం రావటం, రాత్రిపూట చెమటలుపట్టడం, ఆకలి లేకపోవటం, శ్వాస ఆడకపోవటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయచంద్ర, సూపర్‌వైజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ సురభికాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. దీంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడుతున్నారు. మురుగు, దుర్వాసనతో ఇంట్లో నుంచి బయటికి రాలేకపోతున్నారు. కాలనీ నుంచి శ్మశాన వాటిక వరకు సుమారు 500 మీటర్ల వరకు మురుగు పారుతోంది. మురుగు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సురభికాలనీలో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ

నిధులు మంజూరు చేయాలని మేయర్‌కు వినతి



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మాదాపూర్, హాఫీజ్‌పేట్, కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్మశానవాటికల అభివృద్ధి, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, నల్లగండ్ల చెరువు అభివృద్ధి, నాలాలపై చర్చించారు. నిత్యం రద్దీగా ఉండే మంజీరా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. డివిజన్ల పరిధిలో పెండింగ్ పనుల పూర్తికి నిధులు కేటాయించాలని కోరారు.

భూభారతి సదస్సులు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో భూభారతి సదస్సులు కొనసాగుతున్నాయి. జిన్నారం మండలంలోని నల్తూర్ గ్రామంలోని తహశీల్దార్ దేవదాస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో రైతుల నుండి 23 అర్జీలు, ఖాజీపల్లి గ్రామంలో 52 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో తహశీల్దార్ పరమేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో 93 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్, జలమండలి అధికారులు

మియాపూర్: కాలనీలో అసంపూర్తి పనులు పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, ప్రగతి ఎన్‌క్లేవ్, మియాపూర్ గ్రామంలో జలమండలి అధికారులు జీఎం నారాయణ, డీజీఎం అమరుద్దీన్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పారు.కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ సునీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపర్‌వైజర్ లింగయ్య, హర్షద్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుప్రజ తదితరులున్నారు.

ప్రతిభ విద్యార్థులకు నగదు పురస్కారాలు



పటాన్‌చెరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ ,తృతీయ విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు పాండురంగం రాథోడ్, నాగేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

జిన్నారం (పటాన్‌చెరు): ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో 12 కోట్ల 10 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. గుమ్మడిదల నగర కేంద్రం జాతీయ రహదారి నుండి ఎంపీడీఓ కార్యాలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి పెరుగుతున్న ఆదరణ

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు

- ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఖరీదైన వైద్య పరీక్షలు
- డయాగ్నొస్టిక్ హబ్‌కి నిత్యం 30కి పైగా శాంపిల్స్
- శంషాబాద్ ఆస్పత్రికి మంజూరైన ట్రూనాట్ యంత్రం



శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

శంషాబాద్: శంషాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించే పేద రోగులకు వైద్య పరీక్షల ఆర్థిక భారం తప్పుతోంది. ఆస్పత్రి ద్వారానే అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తుండటం వారికి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోంది. సర్కారు దవాఖానాకు వచ్చే రోగులకు సంబంధించిన వైద్య పరీక్షలు డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా పూర్తి చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుండటంతో శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతోంది.

వ్యాధి నిర్ధారణ కీలకం...

రోగులకు సరైన వైద్య చికిత్సలో పరీక్షలు చాలా కీలకం. ప్రైవేటు క్లినిక్‌లలో వేలకు వేలు పోసి వైద్య పరీక్షలు చేయించుకోవడం పేద ప్రజలకు ఆర్థికంగా భారంగా మారుతోంది. దీంతో రోగులు పరీక్షలు చేయించుకోకుండానే కాలం వెళ్లదీసే పరిస్థితులుంటాయి. ప్రస్తుతం ప్రభుత్వ దవాఖానా తలుపు తట్టిన రోగులకు అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా జరుగుతున్న తీరు ఆర్థికంగా రోగులకు ఎంతో మేలు చేస్తోంది. శంషాబాద్ మున్సిపాలిటీలోని సామాజిక ఆస్పత్రికి నుంచి ప్రతి రోజూ కీలకమైన వైద్య పరీక్షల కోసం రక్త, మల, మూత్ర నమూనాలను సేకరించి జిల్లా డయాగ్నొస్టిక్ హబ్‌కు పంపుతున్నారు. ప్రాథమిక పరీక్షలను స్థానికంగానే చేపడుతున్నారు. డయాబెటిక్, కిడ్నీ, లివర్ పరీక్షలతో పాటు బి 12, విటమిన్ డి తదితర లోపాలకు సంబంధించిన అత్యంత ఖరీదైన వైద్య పరీక్షలను సైతం ఇక్కడి వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా పొందుతున్నారు.

మరికొది రోజుల్లో టీబీ పరీక్షలు...

శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరికొద్ది రోజుల్లో టీబీ పరీక్షలు సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. టీబీ పరీక్షలు నిర్వహించే ట్రూనాట్ అనే యంత్రం కూడా ఆస్పత్రికి మంజూరైంది. దీంతో స్థానికంగానే వ్యాధిగ్రస్తులకు టీబీ పరీక్షలు నిర్వహించే వెసులుబాటు సైతం ఆస్పత్రిలో అందుబాటులో రానుండడంతో స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మేలు చేకూరనుంది.

సద్వినియోగం చేసుకోవాలి...



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా అన్ని రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రి వైద్యుల సిఫార్సు మేరకు రోజూ పదుల సంఖ్యలో ఖరీదైన వైద్య పరీక్షలను జిల్లా డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా చేయిస్తున్నాయి. క్షయ వ్యాధిని నిర్ధారించే ట్రూనాట్ యంత్రం కూడా ఆస్పత్రికి మంజూరైంది. మరికొద్ది రోజుల్లో స్థానికంగానే టీబీ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తాం. పేదరోగులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని మెరుగైన వైద్య సేవలు పొందాలి.

- డాక్టర్ దుర్గలత, శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్